# ప్రశాంతత

- జీవి కోల్పోయిన నగ

ఏ భ్రమలు లేని మూల చైతన్యాన్ని యజమానిగా కలిగి వుండి, యజమాని ద్వారా నడిపింపబడుతూ కూడా జీవి ఇంకా చింతాక్రాంతుడై వుండటం మనము గమనిస్తూనే వున్నాము. జీవి తొలుత (బాల్యావస్థలో) ఒక అద్భుతమైన నగను స్వతహాగా కలిగి వుంది దాని పేరే "ప్రశాంతత". కానీ జీవి వయసు పెరుగుతున్న కొద్దీ పెరిగే లావాదేవీల వల్ల వ్యాపారాల వల్ల తెలివితేటల వల్ల ఈ నగను కోల్పోతోంది. ప్రశాంతతను కోల్పోయి చిరాకుచెందుతూ, తిరిగి ప్రశాంతతను పొందటానికి ఏ మార్గమును ఎంచుకోవాలో అర్థంకాక చిరాకు చెందుతూ, ఎంచుకున్న మార్గములో కోరుకున్న ప్రశాంతత దొరకక చిరాకు చెందుతూ, చిరాకు చిరాకు అయిపోతోంది జీవి జీవితము. ధ్యానము, నామజపము, పుణ్యక్షేత్ర దర్శనము, యజ్ఞయాగాది క్రతువులు, మందిర నిర్మాణాది ధార్మిక కార్యక్రమాలు, సద్గ్రంధ పఠనాలు మొదలైన వాటి ద్వారా జీవికి లభిస్తున్న ప్రశాంతత తాత్కాలికమే. జీవికి ఏ కార్యాచరణ ద్వారా కానీ, కార్య విసర్జన వలన కానీ పూర్తి ప్రశాంతత లభించట్లేదు. ఎక్కడ పోయిన వస్తువును అక్కడే వెతుక్కొని తిరిగి పొందాలి కానీ ఒక చోట పోగొట్టుకున్న నగను వేరొక చోటవెతికితే లాభంలేదు కదా! అందుకే జీవి "ప్రశాంతత" అనే నగను ఎక్కడ ఎందుకు ఎలా కోల్పోయిందో తెలుసుకుంటూ దానిని తిరిగి ఎలా ఎక్కడ సంపాదించుకోవాలో తెలుసుకుందాం.

జీవికి సర్వమూ యజమాని ద్వారా నడపబడుతున్నంత వరకూ ప్రశాంతంగానే వుంది జీవి జీవితము. ఎప్పుడైతే జీవి యజమాని ద్వారా జరపబడుతున్న పనిలో జోక్యం చేసుకోవటము మొదలు పెట్టిందో అప్పుడే ఆ క్షణంలోనే జీవి "ప్రశాంతత" అనబడే నగను కోల్పోయింది. జోక్యం వల్ల జీవి ప్రశాంతతను కోల్పోయింది కాబట్టి, యజమాని పనిలో జోక్యం చేసుకోవటము మానటం వల్ల మాత్రమే తిరిగి ప్రశాంతతను పొందగల్గుతుంది తప్ప మరే ఇతర సాధనల ద్వారా కాదు. యజామని పనిలో జోక్యం చేసుకోవటం అంటే ఏమిటి? యజమాని పని ఎక్కడ జరుగుతుంది? జోక్యం చేసుకోకుండాఎలా వుండాలి? అన్న సందేహాలకు సమాధానం తెలుసుకుందాం!

ఎప్పుడైతే జీవి తను పుట్టింది కేవలము కర్మఫలానుభవం కోసం కాదని తనదైన నిజ స్వరూపాన్ని తెలుసుకోవటానికని గుర్తిస్తుందో, తాను అనేక భ్రమలలో కూరుకు పోయానని గుర్తిస్తుందో, తను భ్రమలలో నుండి బయట పడాలని నిర్ణయించుకుని ఏ భ్రమలూ లేని మూల చైతన్యాన్ని యజమానిగా స్వీకరిస్తుందో ఆ క్షణము నుంచీ ఆ జీవికి జరిపింపబడేదంతా యజమాని ఆజ్ఞ ద్వారానే అంటే ఆక్షణం నుంచీ ఆ జీవి దగ్గర యజమాని పనే జరుగుతున్నట్లు లెక్క. కానీ జీవి ఇంకా భ్రమలలో నుండీ బయటపడలేదుకదా!ఆ భ్రమల వల్ల తాను ప్రతి కార్యానికి కారణంగా భ్రమించి కార్యంలో జోక్యం చేసుకుంటోంది. నేనే సాధించాలేమో నేనే చెయ్యాలేమో అనుకుని జోక్యం చేసుకుంటోంది. ప్రేమ వలన, భయం వలన, ఆశింపు వలన, కీర్తి కోసము, పగ వలన ఇలా రక రకాల పరిస్థితులలో పడి యజమాని పనిలో జోక్యం చేసుకుంటోంది. యజమాని పని తీరుకి విరుద్ధంగా జీవి పనితీరు వుంటుంది ఆ రెండూ సరిపోక ఘర్షణ ఏర్పడి జీవి ప్రశాంతతను కోల్పోతోంది.

జీవి తన ఆశతో తన స్వార్ధంకోసం తన సంతోషము కోసము తన కీర్తి కోసము ఒక పనిని ఎలా నిర్వర్తించాలో ప్రణాళిక వేసుకుంటుంది. కానీ యజమాని కేవలము జీవి మేలుని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితులలోనూ జీవి తనకు దూరం కాకూడదనే సదుద్దేశ్యముతో పనిని ఎలా నిర్వర్తింప చేయాలో ప్రణాళిక వేస్తారు. ఆశల వలయంలో చిక్కుకున్న జీవి వేసే ప్రణాళిక, భూత భవిషత్ వర్తమానాలను ఎరిగిన యజమాని వేసే ప్రణాళిక రెండూ పూర్తి విరుద్ధంగా వుంటాయి. దాంతో తన పాచిక పారనందుకు జీవి తీవ్ర అసంతృప్తికి గురి అవుతుంది. యజమాని ఆమోదంలేదు కాబట్టి జీవి తన ప్రణాళికను ఎంత ప్రయత్నించినా విజయవంతంగా అమలు చేసుకోలేదు. తద్వారా అసహనానికి గురై ప్రశాంతతను కోల్పోయి అదిపొందటానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుంది. ఏ ప్రయత్నమైనా తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది కానీ పూర్తిస్థాయి ప్రశాంతతను తిరిగి ఇవ్వలేదు ఎందుకంటే సమస్య జోక్యం చేసుకోవటం దగ్గర వుంది. ఆ పనిని ఆపితేనే జీవికి ప్రశాంతత తిరిగి లభిస్తుంది.

జీవి యజమాని పనిలో జోక్యం చేసుకుంటున్నానని గుర్తించి ఏ సాకు చెప్పకుండా ఒప్పుకుని తిరిగి మరలా ఆ పని చేయకూడదని నిర్ణయించుకోవటం ప్రశాంతతను తిరిగి

పొందడానికి **మొదటి అడుగు**. జీవి తనను తను నిరూపించుకోవాలన్న గర్వాహంకారాల వలనను, తనను ఇతరులు గుర్తించాలి అన్న దురభిమానంతోను, టైమ్ పాస్ కోసము (ఉబుసుపోక పోవటంవల్ల) సహనము లేక పోవటము వలనను, అతి తెలివి తేటల వలనను, యజమాని పట్ల గౌరవము లేకపోవటము వలనను మాత్రమే యజమాని పనిలో జోక్యం చేసుకోవటం జరుగుతోందని జీవి గుర్తించాలి అదే ప్రశాంతతను తిరిగి పొందడానికి **రెండో అడుగు**. యజమాని మన గర్వాహంకారాలను, దురభిమానాలను, అసహనాన్ని, అగౌరవాన్ని, అతి తెలివి తేటలను ఒప్పుకోరని అవి వారి చిత్తానికి విరుద్ధమైనవని జీవి గుర్తించాలి అదే ప్రశాంతతను తిరిగి పొందడానికి **మూడో అడుగు**. యజమాని మీద ప్రేమతోనే జోక్యం చేసుకుంటున్నాను అంటుంది జీవి, యజమాని చేతిలో పనిముట్టులాగా వుండి యజమాని ప్రణాళికను అమలు చేయటం ప్రేమ అనబడుతుంది కానీ యజమాని ప్రణాళికకు విరుద్ధంగా సొంతంగా వెళ్ళటం ప్రేమ అనబడదని జీవి గుర్తించాలి ఇదే ప్రశాంతతను తిరిగి పొందడానికి **నాలుగో అడుగు**. తెలిసీ తెలియక లేక తెలిసీ తెలిసే జోక్యము చేసుకున్నా వెనువెంటనే అది తప్పు అని గుర్తించి క్షమాపణ వేడి జోక్యాన్ని వదిలేయాలి ఇది ప్రశాంతతను పొందడానికి **అయిదో అడుగు**. జోక్యం చేసుకోవడం క్షమాపణ వేడటం ఇదే అలావాటుగా మారిపోకూడదని జీవి గుర్తించాలి ఇదే ప్రశాంతతను పొందడానికి **ఆరో అడుగు**. మనకన్నా యజమాని ప్రణాళికే అమోఘం కాబట్టి ఆయన ప్రణాళిక ప్రకారం జీవించడం తక్కువ కాదు, తప్పు కాదని జీవి గుర్తించాలి ఇదే ప్రశాంతతను పొందడానికి **ఏడో అడుగు**. ఇలా జీవి ప్రశాంతత అనే నగకు ఏడు అడుగుల దూరంలో వున్నాడు.

ఈ ఏడు అడుగులు వేసి ప్రశాంతతను పొందగల్గిన జీవి ఈ భవసాగరాన్ని దాటి తరించినట్లే లెక్క. ఈ ప్రపంచమనే మహా సాగరంలోని ఆటుపోట్లు ఆ జీవిని ఏమీ చేయలేవు. ఈ భవసాగరానికి ఇవతల వైపు పిల్లలమైన మనము అవతల వైపు మన యజమాని వున్నాడు. వారిని చూస్తూ మనం పైన పేర్కొన్న ఏడు అడుగులు వేస్తూ పోతే ఆవలి ఒడ్డున వున్న యజమాని పాద సన్నిధికి చేరతాము, అక్కడ నుండీ మనకు యజమాని ద్వారా ఇప్పటి దాకా ప్రాప్తించబడిన సర్వ ఫలాలు అనుభవంలోకి వస్తాయి. యజమాని జీవికి ఎన్ని ఫలాలు ప్రాప్తింప

చేస్తున్నప్పటికీ జీవి తన ఇష్ట ప్రకారంగా వుంటూ ప్రశాంతతను కోల్పోవటం వల్ల ఫలాలను ఆస్వాదింపలేక పోతోంది. జీవి యొక్క అశాంతిని దీన స్థితిని గుర్తించిన యజమాని జీవికి ప్రశాంతతను తిరిగి పొందే చిట్కాను చెప్పారు. వారు నిరాధారంగా కురిపిస్తున్న ఈ కృపకు అనంత కోటి కృతజ్ఞతలు, నమస్కారాలు తెలియచేసుకుందాం.

ఇదంతా తెలుసుకున్న జీవికి పదే పదే వచ్చే సందేహం యజమాని ప్రణాళిక ఎలా తెలుస్తుంది? దీనికి ముందే సమాధానం చెప్పబడింది దానినే మరల గుర్తు చేసుకుందాం! ఎప్పుడైతే జీవి తాను అనేక భ్రమలలో ఇరుక్కుపోయానని గుర్తించి బయట పడాలని నిర్ణయించుకుని దాని కోసం భ్రమలు లేని మూల చైతన్యాన్ని యజమానిగా స్వీకరిస్తుందో కేవలము యజమాని ప్రభావాన్నే ఒప్పుకుంటుందో ఆక్షణం నుంచీ ఆ జీవి దగ్గర యజమాని పని తీరే జరుగబడుతుంది. అయితే ఈ ప్రశాంతతను పొందటం ఎంత సులువో అంతే కష్టం కూడా! కాబట్టి ఎలాంటి ఆత్రుత పడక నిదానంగా యజమాని చెప్తున్న చిట్కాని ఆకళింపు చేసుకుంటే నగను పొందొచ్చు! మధ్యలో పొరబడి జోక్యం చేసుకున్నా విచారిస్తు కూర్చోక తిరిగి నగను పొందే విధానంలోకి వెళ్ళాలి. యజమాని అనుజ్ఞతోనే నగను తిరిగి పొందటానికి ప్రయత్నిస్తున్నాము కాబట్టి మన ప్రయత్నము విజయవంతం అవుతుందనే ధైర్యాన్ని కలిగి వుండాలి.

ఒలిచి నోట్లో పెట్టిన పండును కూడా మింగలేని మన దుస్థితిని చూసి, ఆ పండును తినకుండా ఏది అడ్డుపడుతోందో (జోక్యం) చూసి, ఆ అడ్డుని తొలిగించుకోమని మనకే వదిలేయకుండా ఎలా తొలగించుకోవాలో కూడా చెప్పిన యజమాని కరుణా కటాక్షాలకు తరించి వారికి సర్వస్య శరణాగతి వేడుతూ......

**- గిరిధర్ వాణి ఆనందనందనం**

15/12/2010

**ప్రశాంతత ప్రదాతా జై !**